'రుణమాఫీ'లో ఇబ్బందులు కలిగించొద్దు

- అధికారులు నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

నెల్లికుదురు: రావిరాల వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, సెప్టెంబర్ 10: ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ అన్నారు. ఇటీవల వర్షాల వల్ల వరద నష్టాలపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వివిధ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉన్నత అధికారులతో మాట్లాడి అదనంగా ఫీల్డ్ ఆఫీసర్లు ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించాం. రూ.లక్షలోపు వారికి సైతం రుణ మాఫీ కాలేదని తమ దృష్టికి వచ్చిందని, ఎందుకు కావడంలేదని ఏవోను ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలుంటే సత్వరంగా పరిష్కరించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 2,678 ఎకరాల పంటనష్టం జరిగిందని ప్రాథమిక నివేదిక ఇచ్చారని, క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ మీటరు లేనివారికి ప్రభుత్వం రూ. 938కే మీటర్ అందిస్తున్నదని, ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. వర్షం వల్ల కూలిన విద్యుత్ స్తంభాలు, నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే పునరుద్ధరించాలని, ధ్వంసమైన రోడ్లకు మర్మమతులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పర్మనెంట్‌గా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో బాలరాజు, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా రావిరాల గ్రామంలో వరద బాధితులకు విద్యా హెర్బ్స్ సంస్థ పౌండర్ కే శ్యామ్ ప్రసాద్ సహకారంతో 120 మంది బాధితులకు ఎమ్మెల్యే మురళీనాయక్ చేతుల మీదిగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాగా, రైతు స్వరాజ్ వేదిక(ఆర్ఎస్‌వీ), రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఆర్‌డీఎస్‌ఎస్) సహకారంతో రావిరాల బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

క్షేత్రస్థాయిలో నష్టంపై అంచన వేయాలి

కేసముద్రం: వర్షాల వల్ల జరిగిన నష్టం, వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రంలోని రైతు వేదికలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అందించిన నివేదిక ఆధారంగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ సర్వే చేస్తుందని, ఈ సర్వేలో తప్పు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టలకు మరమ్మతులు చేయాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, ఎకరానికి రూ.10 వేలు, పశువులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5 వేలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్లు అల్లం నాగేశ్వరరావు, అంబటి మహేందర్ రెడ్డి, ఎంపీడీవో ఉదయశ్రీ, డీటీ ఎర్రయ్య, డీఈలు శ్రీనివాసులు, కుమారస్వామి, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా, మండల కేంద్రానికి చెందిన పీడీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బనిశెట్టి విజయ వెంకటేశ్ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.10 వేల చెక్కును ఎమ్మెల్యే మురళీనాయక్‌కు అందజేశారు.

ఉదాసీనత ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

గూడూరు: వరద సాయంపై అంచనాలు వేసి ప్రభుత్వానికి అందించాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మురళీనాయక్ హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వర్షాల వల్ల జరిగిన నష్టంపై అన్ని శాఖల అధికారులతో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో పంట నష్టం, ఆస్థినష్టం జరిగిందని, వీటిపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీవో వీరస్వామి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, నెక్కొండ మార్కెట్ వైస్‌చైర్మన్ ఎడ్ల నరేశ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- జిల్లాలో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి

మహబూబాబాద్ రూరల్: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కేసముద్రం: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: వెనుకబడిన వర్గాల ఆత్మ గౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ. ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగుతుల ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ అనేక పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజాస్వామ్య ఉద్యమానికి స్ఫూర్తిని చ్చిన ఐలమ్మ సేవలు, ధైర్య సాహసాలను గుర్తు చేశారు. అనంతరం పట్టణంలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలం, మంజూరైన డోబీఘాట్ పనులు నిర్వహించాలని కలెక్టర్‌కు రజక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు నరసింహాస్వామి, శ్రీనివాస్, మాచర్ల ఉప్పలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: డోర్నకల్, యాదవనగర్ సెయింట్ ఆగ్నేష్ హైస్కూల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కార్యదర్శి దాసరి మల్లేశం, మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొమ్మన అశోక్‌కుమార్, పావని వెంకన్న, రమేశ్, వెంకటేశ్వర్లు, లలిత పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: మండలంలోని కొత్తపేటలో రజకసంఘం అధ్యక్షుడు మాచర్ల ఉపేందర్ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సైదులు, రాములు, వెంకన్న, సుక్కయ్య, వెంకన్న, వీరస్వామి పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

నర్సింహులపేట: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి కేవీపీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యమ స్ఫూర్తి రగిలించిన పోరాట యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. మందుల యాకూబ్, సురేశ్, ముత్తయ్య, రమేశ్, పూలమ్మ, యాదగిరి, శ్రీను ఉన్నారు.

ఐలమ్మ ఆశయాలను సాధించాలి

పెద్దవంగర: తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ స్ఫూర్తి ఎంతోగొప్పదని రజక సంఘం మండల నాయకుడు బోనగిరి లింగమూర్తి అన్నారు. మంగళవారం పెద్దవంగరలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు చిన్నన్న, సోమయ్య, యాకయ్య, ఎర్రన్న, రాములమ్మ, యాదమ్మ, పార్వతమ్మ, సైదమ్మ ఉన్నారు.

చిన్నగూడూరులో..

చిన్నగూడూరు: మండల కేంద్రంలో ఎస్సీ సాధన సమితి, రంజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె ఆశయ సాధన కోసం ఉద్యమించాలన్నారు. సంఘాల నాయకులు పసనాది విజయ్, నవీన్, సోమన్న, దేవేందర్, శ్రీను వెంకన్న, సోమయ్య, లాలయ్య, శివఉన్నారు.

మరిపెడలో..

మరిపెడ: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్పర్సన్ సింధూరకుమారి మాట్లాడుతూ.. బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన వీరవనిత ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చారన్నారు.

కురవిలో..

కురవి: మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యదర్శి విజయలక్ష్మి, గ్రామస్తులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం: కేసముద్రం విలేజీలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు చాకలి ఐలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య, ఎస్ వెంకన్న, కే రాహుల్, టీ వెంకన్న, కే బాబు, పీ వెంకట్‌రెడ్డి, అశోక రాంబాబు, బీ వెంకన్న, మహేందర్, యాకన్న, చారి ఉన్నారు.

కొత్తగూడలో..

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ విష్ణువర్ధన్‌రావు ఐల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెల్లుట్ల భాస్కర్, సుధాకర్, రాజ్ కుమార్, పాషామియా, నర్సయ్య, సాంబయ్య, రాంబాబు, వసంత, జుమ్మేలాల్, సూరయ్య, బేబతి, శ్రీలత, మాధవి, పవన్ పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: మండల కేంద్రంలోని మంగపతిరావు భవనంలో సీపీఎం అధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు కందునూరి కవిత, భాగం లోకేశ్వరావు, ప్రవీణ్, భిక్షం, కోటయ్య, రాంబాబు, సాయి ఉన్నారు. సీపీఐ కార్యాలయం నల్లమల గిరిప్రసాద్ భవనంలో ఐలమ్మ చిత్రపటానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు. శ్రీనివాస్, నరసింహరావు, శ్రీనివాస్‌రావు, జనార్దన్, రమేశ్, పిచ్చయ్య, పద్మ పాల్గొన్నారు.

ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

తొర్రూరు: వీరనారి చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్ అన్నారు. మంగళవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు గంజి విజయపాల్‌రెడ్డి, పెదగాని సోమయ్య, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష, నాయకులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని దాట్లలో సీపీఎం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

చిన్నగూడూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

మరిపెడ: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి

గార్ల: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



నర్సయ్య కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, సెప్టెంబర్ 10: వరద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. వెంకటాపురానికి చెందిన గుండాల చిన్ననర్సయ్య ఇటీవల వర్షాల వల్ల ప్రమాదవశాత్తు వరదలో పడి మృతి చెందాడు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.5లక్షల నష్ట పరిహారం ప్రకటించడంతో మంగళవారం చెక్కును నర్సయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలకు నష్టపోయిన బాధితులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఇండ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ పెదగాని సోమయ్య, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో..

నర్సింహులపేట, సెప్టెంబర్ 10: భారీ వర్షాల కారణంగా మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఫకీరతండా జీపీ పరిధిలో ముంగిమడుగు రోడ్డువద్ద వ్యవసాయ బావులు, బోర్లకు విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ వరద తాకిడికి కింద పడిపోయింది. దీంతో 10 రోజుల నుంచి పొలాలకు నీరు లేదని, వెంటనే అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫకీరతండాలో కిందపడిన ట్రాన్స్‌ఫార్మర్

నల్లబెల్లం, పటిక పట్టివేత

స్వాధీనం చేసుకున్న బెల్లంను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: జిల్లా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మానుకోట డివిజన్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి కథనం ప్రకారం.. కురవి గేటు, సలార్తండా, బాబునాయక్ తండాలో జిల్లా ఎక్సైజ్‌టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు చేశారన్నారు. నెల్లూరు నుంచి రైలులో తీసుకొస్తున్న నల్లబెల్లం స్వాధీనం చేసినట్లు పేర్కొన్నారు. గూడూరు మండలం మంగోలిగూడేనికి చెందిన లునావత్ మహేందర్, వీరన్న, మోహన్ చంటి వద్ద 500 కిలోల బెల్లం, 20 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సరే అక్రమంగా బెల్లం వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ నీరజ, ఎస్సై కిరీట్, సిబ్బంది వెంకన్న, శేఖర్, నర్సింహారావు, హచ్చ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 9,900 ఎకరాల్లో పంట నష్టం

క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న సర్వే

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో నేటి వరకు 9,900 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నిర్ధారించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖలోని వివిధ స్థాయిలో అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి వాస్తవ పరిస్థితుల ఆధారంగానే నమోదు చేశారన్నారు. జిల్లా, డివిజనల్, మండలం, గ్రామాల వారీగా ప్రతిరోజు పంటనష్టాన్ని పరిశీలించారని, రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఇంక పంట నష్టం సర్వే కొనసాగుతుందని డీఏవో తెలిపారు.

పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే నూతన భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో సమస్యలపై ఏఎంవోకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ పాఠశాలల్లోకి వర్షపు నీరు చేరిందని, అనేక పాఠశాలల శ్లాబులు, గోడలు ఊడిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు పరిశీలించి వాటికి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుగులోత్ సూర్యప్రకాశ్, శ్రావణ్, రాకేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నీట మునిగిన ఇండ్ల పరిశీలన

ఇండ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కేసముద్రం, సెప్టెంబర్ 10: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో పట్టి వాగు సమీపంలో నీట మునిగిన ఇండ్లను మంగళవారం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కేసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. రికార్డులు, హాజరు పట్టిక, వంటగదిని పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉదయశ్రీ, ఈవోపీఆర్‌డీ హరిప్రసాద్, ఏఈ మానస, గ్రామస్తులు ఉన్నారు.

డోర్నకల్ సీఎస్ఐ అధ్యక్ష పీఠం మాజీ కోశాధికారి ఎడ్విన్‌రావు మృతి

ఎడ్విన్‌రావు (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబర్ 10: డోర్నకల్ సీఎస్ఐ అధ్యక్ష పీఠం మాజీ కోశాధికారి ములక ఎడ్విన్ రావు (94) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఖమ్మంలోని కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎడ్విన్ రావు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వసతి గృహాలను పరిశీలించాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల వసతి గృహాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణంలోని బాలికల హాస్టల్ వార్డెన్లు అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. జ్వరాలు వస్తే హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాలు నివారించవచ్చు

డోర్నకల్, సెప్టెంబర్ 10: గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే ప్రమాదాలు జరుగుతాయని ఎస్ఎఫ్‌వో ఎన్ వీరేష్ అన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి సూచనల మేరకు మంగళవారం మండలపాల వద్దకు నిర్వాహకులకు సూచనలు, సలహాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్, పెట్రోల్, కిరోసిన్ వంటి పేలుడు వస్తువులు ఉంచవద్దన్నారు. డీవోపీ ఆర్ శ్రీనివాస్, ఎల్ఎఫ్ ఎం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దవంగర, సెప్టెంబర్10: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉప్పరగూడేనికి చెందిన శ్రీరాం వెంకన్న(48) బైక్‌పై బంధువులను పెద్దవంగరలో వదిలి తిరిగి వస్తుండగా ఉప్పరగూడెం నుంచి పెద్దవంగర వెళ్తున్న అశోక లేలాండ్ వాహనం ఎదురుగావచ్చి ఢీకొట్టింది. దీం తో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

గూడూరు, సెప్టెంబర్10: ఆరోగ్యం సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎలమందల సమ్మయ్య (59) నాయీబ్రహ్మణ వృత్తి చేసుకుని జీవిస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సమ్మయ్య మంగళవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకోగా, గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమ్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: భారీ వర్షాల వల్ల జరిగిన నష్టానికి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. మంగళవారం తమ బృందం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వర్షాలకు ఊర్లు కొట్టుకు పోయి, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. నష్టపోయిన వారికి వెంటనే తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సక్రునాయక్, హలావత్ లింగ్యానాయక్, పాపయ్య, యాకయ్య, సూర్యం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురవి, సెప్టెంబర్ 10: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వీరభద్రస్వామి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోడ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన, ఉద్యోగం చేస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 17 వరకు అపరాద రుసుం లేకుండా, 31వరకు రూ.25 అపరాద రుసుంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

'ఆయిల్‌పామ్' సాగుతో అధిక లాభాలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ అధికారి మరియన్న ఒక ప్రకటనలో తెలిపారు. వరి పంటతో ఆదాయం ఎకరానికి రూ10వేలు మాత్రమే వస్తుందని, ఆయిల్‌పామ్ సాగు చేస్తే రూ.లక్ష వరకు ఆదాయం పొంద వచ్చని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు కోతులు, కుక్కల బెడత ఉండదని, రవాణా, మార్కెంటింగ్ ప్రాసెస్ చేసేందుకు అన్ని రకాల వసతులు ఉంటాయన్నారు.

తెగిన రోడ్డు పూడ్చివేత

నర్సింహులపేట, సెప్టెంబర్ 10: భారీ వర్షాల వల్ల మండలంలోని రామన్నగూడెం–ముంగిమడుగు దారిలో గణేశ్ చెరువు కట్ట తెగిపోవడంతో రోడ్డు తెగిపోయింది. దీంతో 10 రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం అధికారులు రోడ్డును మట్టితో పూడ్చివేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

కూలిన కాంపౌండ్ వాల్

కురవి, సెప్టెంబర్ 10: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కాంపౌండ్ వాల్ ఇటీవల కురిసిన వర్షాలకు కూలింది. వాల్ కూలిపోవడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతారని, అధికారులు వెంటనే కాంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.

పంటల క్షేత్రస్థాయి పరిశీలన

కురవి(సీరోలు), సెప్టెంబర్ 10: సీరోలు మండలలోని చింతపల్లి రెవెన్యూ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను సోమవారం వ్యవసాయశాఖ విస్తరణాధికారులు సురేశ్, రమేశ్ పరిశీలించారు. మద్దెల వాగు పరివాహకంలో కొట్టుకుపోయిన పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. బుధవారం గ్రామంలో పర్యటించనున్నట్లు తెలిపారు. రైతులు మహేశ్, రామకృష్ణ, ఆవులదొడ్డి శ్రీశైలం, దయ్యాల బాబు, భూక్యా సైదులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు

గార్ల, సెప్టెంబర్ 10: వర్షాల కారణంగా తెగిపోయిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభాలకు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులుచేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 100 పోల్స్, మున్నేరు పరిసర ప్రాంతాల్లో విరగడంతో రైతులు అసౌకర్యానికి గురయ్యారని, విద్యుత్ నిలిచిపోవడంతో పునరుద్ధరణ పనులు చేస్తునట్లు ఏఈ మహేంద్రబాబు తెలిపారు. పనులను మంగళవారం ఎస్ఈ నరేశ్ పరిశీలించారు. రైతులకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాచేస్తామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మరిపెడ: మండలంలోని సీతారాంతండాకు చెందిన వరద బాధితులకు ఖమ్మంకు చెందిన శాంతి దవాఖాన యాజమాన్యం మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలతో నిరాశ్రయులైన వారికి చేయూత అందిస్తున్నట్లు డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మధు, నవీన్‌రెడ్డి, వీరన్న, ప్రశాంతి, సతీశ్ ఉన్నారు.